# రైతులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు మోసపోవద్దు!

# ప్రపంచ వ్యవసాయ వేదిక కార్పోరేటు సంస్థల లాబీ బృందం మాత్రమే

"చిన్న, సన్నకారు రైతులు కేంద్రంగా సుస్థిరమైన భవిష్యత్తు కోసం వ్యవసాయ రూపకల్పన అనేది సదస్సు అంశంగా వుండి దానిని నిర్వహిస్తున్న సంస్థ పేరు "ప్రపంచ వ్యవసాయ వేదిక". అయినప్పుడు ఇది చిన్న రైతుల ప్రయోజనాల కోసం పని చేస్తున్న నిఖార్సయిన ప్రపంచ స్థాయి వేదిక అని మనలో చాలా మంది ఆశిస్తాం. అయితే నిజం దీనికి పూర్తి విరుద్ధంగా వుంది. అందుకే ఆంధ్రప్రదేశ్‌లోని రైతు సంఘాలన్నీ కలసి దాని నిజస్వరూపాన్ని రైతుల ముందు బయట పెట్టటానికి ఈ కరపత్రాన్ని మీ ముందుకు తెస్తున్నాయి. ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు ఇటువంటి కార్పోరేటు సంస్థల లాబీ బృందంతో చేతులు కలపవద్దని బలంగా కోరుతున్నాయి.

**ప్రపంచ వ్యవసాయ వేదిక అంటే ఏమిటి?**

ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలనూ, విధానాలను తయారు చేసే వారినీ ప్రభావితం చేయటానికి అతిపెద్ద వ్యవసాయ వాణిజ్య బహుళ జాతి కంపెనీలు ఏర్పరచిన సంస్థ ఈ **ప్రపంచ వ్యవసాయ వేదిక** ఇది పెద్ద కార్పోరేటు కంపెనీల ప్రయోజనాలకు అనుకూలంగా "వ్యవసాయాన్ని "వ్యవసాయానికి కొత్త రూపకల్పన" చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. దీని కేంద్ర కార్యాలయం అమెరికాలోని సెయింట్ లూయిస్ నగరంలో వుంది. మోన్సాంటో కేంద్ర కార్యాలయం కూడా అక్కడే ఉంది. ప్రపంచ వ్యవసాయ వేదిక బోర్డు మెంబర్లలో చాలా మంది బహుళ జాతి కంపెనీలలో ఉన్నత స్థానాలలో వున్నవారే. (బాక్స్‌లో చూడండి)

అమెరికన్ సోయాబీన్ అసోసియేషన్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు చొరవతో 1997లో ప్రపంచ వ్యవసాయ వేదిక ఏర్పడింది. ప్రపంచ వ్యవసాయ వేదిక ఛైర్మన్ డాక్టర్ కెన్నెత్ బేకర్ గతంలో మోన్సాంటో కంపెనీలో ప్రభుత్వ వ్యవహారాల డైరెక్టర్‌గా పని చేశాడు. ఐరోపా యూనియన్‌లో జన్యూ మార్పిడి సోయాబీన్‌కు ఆమోదాన్ని సంపాదించటం అతడు సాధించిన పెద్ద విజయం.

2001 నుండి ప్రపంచ వ్యవసాయ వేదిక ప్రతి రెండు సంవత్సరాల కొకసారి తన "సదస్సు"ను నిర్వహిస్తున్నది. దానిని వివిధ దేశాలకు చెందిన విధానాలు తయారు చేసే వారికి, ప్రభుత్వ అధికారులను, పరిశోధనా సంస్థలను ఆహ్వానించి విధానాలను తమకు అనుకూలంగా వుండేటట్లు ప్రభావితం చేస్తున్నది. 2009 వరకు జరిగిన 5 సదస్సులు సెయింట్ లూయిస్ నగరంలో జరిగాయి. 2011లో బెల్జియంలో జరిగింది. ఈ సదస్సులకు ఇతర దేశాల నుండి ఎంపిక చేసిన అధికారులను, విధానాలను తయారు చేసే వారిని ఆహ్వానించారు. 2007లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి కూడా దీనికి హాజరయ్యారు.

**ప్రపంచ వ్యవసాయ వేదిక నిర్దేశకులెవరు?**

ఈ వేదిక బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లందరూ బహుళ జాతి కంపెనీలకు చెందిన వారే. ప్రపంచ వ్యవసాయ వేదిక పుట్టుపూర్వోత్తరాలను, దానిని నిర్దేశిస్తున్న వారెవరో అర్థం చేసుకోవటానికి గతంలోనూ ఇప్పుడూ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కూ, పెద్ద పెద్ద వ్యవసాయ వాణిజ్య కంపెనీలకూ వున్న సంబంధాలను చూడాలి. ప్రపంచ వ్యవసాయ వేదికలాగే ఈ కంపెనీల కేంద్ర కార్యాలయాలు కూడా సెయింట్ లూయిస్ నగరం (అమెరికా)లోనే వున్నాయి.

- **మోన్సాంటో:** కేంద్ర కార్యాలయం సెయింట్ లూయిస్ నగరం. ప్రపంచ వ్యవసాయ వేదిక ఛైర్మన్ మోన్సాంటో ప్రభుత్వ వ్యవహారాల మాజీ డైరెక్టరుగా పనిచేసి ప్రభుత్వంతో లాబీయింగ్ చేయటానికి సహాయపడ్డాడు. వేదిక మరొక బోర్డు మెంబరు మోన్సాంటో డైరెక్టరు
- **అమెరికన్ సోయాబీన్ అసోసియేషన్:** ప్రపంచ వ్యవసాయ వేదిక వ్యవస్థాపకుడు లియోనార్డ్ గువారై. సోయాబీన్ పరిశ్రమకు బలంగా లాబీ చేస్తున్న ఈ కంపెనీ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్. దీని కేంద్ర కార్యాలయం సెయింట్ లూయిస్ నగరంలోనే వుంది.
- **నోవస్ ఇంటర్నేషనల్:** ఇది పెద్ద పశు ఆధారిత బహుళజాతి కంపెనీ, గతంలో మోన్సాంటో పశువిభాగంగా వుండేది. ప్రపంచ వ్యవసాయ వేదిక ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డైవిడ్ ఫ్రీడ్‌మెన్ నోవస్ కంపెనీ కంట్రోలర్. వేదిక మరొక డైరెక్టర్ ట్రిసియాబీలిస్ నోవస్ కంపెనీలో ఛీఫ్ ఆఫ్ స్టాఫ్.
- **బిఎఎస్ఎఫ్:** ఇది ప్రపంచంలో కెల్లా అది పెద్ద రసాయనాలు తయారు చేసే బహుళజాతి కంపెనీ. దాని ప్రభుత్వ వ్యవహారాల శాఖ అధిపతి ప్రపంచ వ్యవసాయ వేదిక డైరెక్టర్.
- **అన్‌హ్యూసర్ బుష్:** అమెరికాలో అతిపెద్ద బీర్ కంపెనీ. దీని కేంద్ర కార్యాలయం కూడా సెయింట్ లూయిస్ నగరం. ఈ కంపెనీ ఇప్పుడు పెద్ద ఎత్తున బయోఫ్యూయల్స్‌లో వ్యాపారం సాగిస్తున్నది. దాని ఉపాధ్యక్షుడు ప్రపంచ వ్యవసాయ వేదిక డైరెక్టర్
- **బంజ్, ఎన్ఎ:** ప్రపంచంలో కెల్లా అతి పెద్ద వ్యవసాయ వాణిజ్య బహుళజాతి కంపెనీ. దీని మాజీ ఉపాధ్యక్షుడు ప్రపంచ వ్యవసాయ వేదిక డైరెక్టరు.

ప్రపంచ వ్యవసాయ వేదికకున్న 13 మంది బోర్డు సభ్యులలో 8 మంది డైరెక్టర్లు ఈ కార్పోరేటు సంస్థలకు చెందిన వారే. మిగిలిన వారికి కూడా పరోక్ష సంబంధాలున్నాయి. ప్రపంచం నలుమూలలా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయటానికి ఈ కంపెనీలకు ప్రపంచ వ్యవసాయ వేదిక ఒక వాహిక లాంటిది.

## ప్రపంచ వ్యవసాయవేదిక 2013 సదస్సు: కార్పోరేట్లు నిర్ణయించిన ఎజెండా

**కార్పోరేటు స్పాన్సర్లు:** బేయర్ క్రాప్ సైన్స్ (ప్లాటినం స్పాన్సర్). ఇది పురుగు మందులు, జన్యు మార్పిడి పంటలను తయారు చేస్తున్న అతి పెద్ద కంపెనీ, మోన్సాంటో, నోవో జైమ్స్ (డానిష్ బయోటెక్ బహుళజాతి కంపెనీ) ఫుడ్ పోలిస్ (కొరియన్ వ్యవసాయ వాణిజ్య కూటమి), జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ (డ్రిప్, స్ప్రింక్లర్ సిస్టమ్స్), నోవస్ ఇంటర్నేషనల్ (మోన్సాంటో నుండి విడివడిన పశు ఆధారిత కంపెనీ), అమెరికన్ సోయాబీన్ ఎక్స్‌పోర్టు కౌన్సిల్, బిఎఎస్ఎఫ్ (అతి పెద్ద రసాయనాలు తయారు చేసే బహుళజాతి కంపెనీ)

సదస్సు ఎజెండాను కూడా ఈ కంపెనీలే నిర్ణయించటంలో ఆశ్చర్యం లేదు. బేయర్ కంపెనీ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ "వ్యవసాయంలో విప్లవం ఎందుకు అవసరం" అనే అంశంపై మొదటి రోజు ప్రధానోపన్యాసం ఇస్తున్నారు. "చిన్న రైతులకు పరిష్కారాలను కనుగొనటం" అనే అంశంపై సమావేశాన్ని కూడా బేయర్ స్పాన్సర్ చేస్తున్నది. అదే విధంగా నోవోజైమ్స్ ప్లీనరి రౌండ్ టేబుల్ ఉపాధ్యక్షుడు, నోవస్ ఇంటర్నేషనల్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, రాయల్ డిఎస్ఎం అధ్యక్షుడు, స్టాండర్స్ చార్టర్స్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రధానోపన్యాసాలు ఇస్తున్నారు. రౌండు టేబుల్ సమావేశానికి మోన్సాంటో, ఆదాని విల్మర్, అమెరికన్ సోయాబీన్ అసోసియేషన్ ఎక్స్‌పోర్టు కౌన్సిల్, బిఎఎస్ఎఫ్, ఐటిసి కంపెనీల అధికారులు పాల్గొంటున్నారు. "చిన్న రైతులకు సుస్థిర భవిష్యత్తును" కల్పించటంపైన ప్రపంచ వ్యవసాయానికి దిశానిర్దేశం చేస్తున్న ప్రపంచ వ్యవసాయ వేదికలో వున్నది వీళ్ళే.

### ప్రపంచ వ్యవసాయ వేదికను స్పాన్సర్ చేస్తున్నది ఎవరు?

కెల్లాగ్ ఫౌండేషన్, మోన్సాంటో, నెస్లే, టైసన్ ఫుడ్స్, గేట్స్ ఫౌండేషన్, డి-1 ఆయిల్స్, ప్రపంచ బ్యాంకు, ఐఎఫ్‌పిఆర్ఐ వంటి కార్పోరేటు సంస్థలు ప్రపంచ వ్యవసాయ వేదికకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. మరికొన్ని బహుళజాతి కంపెనీలు కూడా 2 ఏళ్ళకు ఒకసారి జరిగే ఈ వేదిక సదస్సును స్పాన్సర్ చేయటానికి బారులు తీరుతున్నాయి.

ఇదంతా రహస్యంగా జరగటం లేదు. బయటికి ప్రజా ప్రయోజనం కోసమని అనిపించే "తటస్థ వేదికల"ను సృష్టించటానికి పెద్ద బహుళ జాతి కంపెనీల పన్నిన స్పష్టమైన వ్యూహమిది. ఇదంతా తెలుసుకోకుండా వారి వలలో పడి ప్రభుత్వాలు, ప్రభుత్వ పరిశోధనా సంస్థలు వారికి చట్టబద్ధత కల్పిస్తున్నాయి.

### ప్రపంచ వ్యవసాయ వేదికతో ప్రభుత్వం మరియు వ్యవసాయ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం - ప్రాధాన్యతల తారుమారు

ప్రపంచ వ్యవసాయ వేదిక సదస్సు 2013 కు ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడడానికి కారణం – మొదటి సారి, ఒక ప్రభుత్వం, కార్పోరేట్ లాబీతో కలసి, ప్రపంచ వ్యవసాయ సదస్సును నిర్వహించడం. ఈ సదస్సుకు "చిన్న కమతాలకు ప్రాధాన్యత నిస్తూ.. సుస్థిర భవిష్యత్తుకోసం వ్యవసాయాన్ని నూతనంగా రూపొందించడం" అని నామకరణం చేసినా, సదస్సు ఎజెండాను పరిశీలిస్తే మాత్రం ప్రపంచ వ్యవసాయ సంబంధిత సమస్యలకు పెద్ద వ్యవసాయ వాణిజ్య కార్పోరేట్లు తమ స్వంత 'పరిష్కారాలను' ప్రోత్సహిస్తున్నాయని అర్థమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో "దేశీయ, ప్రపంచ వ్యవసాయ సంబంధిత విషయాలను సమగ్రంగా చర్చించడానికి, పరిశీలించడానికి, వ్యవసాయ విధానాలను రూపొందించడానికి ప్రపంచ వ్యవసాయ వేదిక ఒక్కటే తటస్థ, సరైన వేదిక" అని చెప్పింది. ఈ ప్రకటనను చూస్తే ప్రభుత్వం వేదిక స్వభావాన్ని గురించి తప్పుడు అవగాహనతో వుందని అర్థమవుతుంది. సదస్సులో పాల్గొనడానికి ప్రతినిధి రుసుంగా 11400 రూ॥లు నిర్ణయించారంటేనే, ఇది రైతులకు ఆహ్వానించడానికి కాదని అర్థమైపోతుంది.

కార్పోరేట్లు ముందుకు తెస్తున్న ఎజెండాతో నిర్వహించబడే ఈ సదస్సుకు ప్రభుత్వం దూరంగా వుండాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం రైతుల, రైతు సంఘాల న్యాయమైన అభిప్రాయాలను, ఆందోళనలను గుర్తించినప్పటికీ ఇప్పటికిప్పుడు సదస్సు నిర్వహణ నుండి బయటకు రాలేని పరిస్థితి వుండవచ్చు. కానీ పెద్ద కార్పోరేట్ సంస్థలకు మేలు చేసే ఏ విధానాలనూ ప్రభుత్వం స్వీకరించబోదని రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి.

ఇటువంటి కార్పోరేట్ సంస్థలతో భవిష్యత్తులో ఎటువంటి పొత్తూ పెట్టుకోకూడదని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతు సంఘాలన్నీ ప్రభుత్వాన్ని ఒక్క గొంతుతో విజ్ఞప్తి చేస్తున్నాయి. 2012లో కూడా ఇటువంటి ఘటనే ఒకటి జరిగింది. "భారత దేశానికి ఆహార భద్రత" పేరుతో జన్యుమార్పిడి పంటల లాబీ గ్రూప్ (ఎబిఎల్ఇ), విత్తన కంపనీల లాబీ గ్రూప్ (యన్ఎస్ఎఐ) సంయుక్తంగా ఢిల్లీలో సమావేశాలను నిర్వహిస్తే, భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ అందులో సహ నిర్వహణ బాధ్యతలను నిర్వహించింది. భారత రాష్ట్రపతి ఈ సమావేశాలను ప్రారంభించారు. ఒకసారి ప్రభుత్వం ఇటువంటి వాటిలోకి దిగితే, యూనివర్సిటీలు, భారత ప్రభుత్వ రంగ పరిశోధనా సంస్థలు కూడా దిగిపోతాయి. భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకుంటాయి.

ఇతర దేశాల అనుభవాలను పరిశీలిస్తే, తమ పనులకు చట్ట బద్ధత కల్పించుకోవడానికి, వ్యవసాయ విధానాలను, పరిశోధనలను ప్రభావితం చేయడానికి కార్పోరేటు సంస్థలు, ఇటువంటి ఎత్తుగడలను అనుసరిస్తాయి. కాకపోతే దానికి "చిన్న రైతులకు సహాయం చేయడానికి" అనే ముసుగు తొడుగుతారు.

వ్యవసాయంపై కార్పోరేట్ల గుత్తాధిపత్యాన్ని పెంచడానికి తోడ్పడే, చిన్నరైతులకు, పర్యావరణానికి హాని చేసే విధానాలను రూపొందిం చేందుకు కార్పోరేట్ సంస్థలు నిర్మించిన ఇటువంటి వేదికలకు రైతులు, ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రజలు దూరంగా వుండాలని రైతు సంఘాలుగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, భారతీయ కిసాన్ మోర్చా, తెలుగు రైతు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, భారతీయ కిసాన్ సంఘ్, రైతు స్వరాజ్య వేదిక**

*వివరాలకు: విస్సా కిరణ్ కుమార్, కన్వీనర్, రైతు స్వరాజ్య వేదిక, ఫోన్: 97017 05743, e-mail: kiranvissa@gmail.com*